క్లుప్తంగా

నేడు మంత్రి వేణు పర్యటన

రామచంద్రపురం రూరల్: అప్పర్ ప్రైమరీ నుంచి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయిన కాపవరం పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ మేరకు మంత్రి అడిషనల్ పీఎస్ పి.తేజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 9.30కు కాజులూరు మండలం తనుమల్ల గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ భూమి పూజలో, 10 గంటలకు అమలాపురంలో కలెక్టర్ కార్యాలయంలో జరిగే షన్ సమావేశంలో, మధ్యాహ్నం 2కు కొత్తపేట నియోజకవర్గంలో సామాజిక సాధికార యాత్రలో పాల్గొంటారని వివరించారు.

నేడు రాట ముహూర్తం

రామచంద్రపురం రూరల్: ఏటా కార్తిక మాసంలో ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి గుడి వద్ద దీపారాధన మహోత్సవం జరుగుతుంది. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో జరిగే ఈ మహోత్సవానికి గురువారం ఉదయం 9.18కు రాట ముహూర్తం నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యుడు మేడిశెట్టి కృష్ణదాసు బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రముఖ విద్యావేత్త, పైండా అన్నసత్రం నిర్వాహకుడు పైండా సుబ్రహ్మణ్య జగన్నాథ సత్యప్రసాద్ చేతుల మీదుగా రాట ముహూర్తం జరుగుతుందని చెప్పారు.

ప్రేమానురాగాలు నింపిన భగిని హస్త భోజనం



నిడదవోలు కోట సత్తెమ్మ గుడి వద్ద తీపి తినిపిస్తున్న మహిళ

కపిలేశ్వరపురం: కార్తిక మాసం నేపథ్యంలో వివిధ గ్రామాల్లో బుధవారం భగిని హస్త భోజన కార్యక్రమాలతో సందడి నెలకొంది. సోదరి చేతి వంటను రుచిచూసి, నిండైన మనస్సుతో ఆశీర్వదిస్తూ ప్రేమానురాగాలను పంచుకునే పర్వదినంగా భగిని హస్త భోజన కార్యక్రమం నిలిచింది. దీనిని యమద్వితీయ పండగ అని కూడా అంటారని, సోదరి చేతి వంటను భుజించిన సోదరుడికి యమ దండన నుంచి విముక్తి లభిస్తుందని పెద్దలు పేర్కొన్నారు. అంగర, పడమర ఖండ్రిక తదితర గ్రామాల్లో సోదరులంతా వారి సోదరీమణుల ఇళ్లకు చేరుకుని, వారి చేతి వంటను రుచిచూసి.. కానుకలను సమర్పించారు. అంగర గ్రామానికి చెందిన ఆర్యవైశ్య కుటుంబాల వారు నిడదవోలు కోట సత్తెమ్మగుడి వద్ద సోదరులకు భోజనాన్ని వడ్డించారు. కుటుంబ సభ్యులతో సందడిగా గడిపారు.

చినజీయర్ స్వామిని కలిసిన పాపారాయుడు



స్వామివారిని కలిసిన పాపారాయుడు

కపిలేశ్వరపురం: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామివారి జన్మదినం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వికాస తరంగిణి అధ్యక్షుడు కర్రి పాపారాయుడు బుధవారం విజయవాడలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామివారికి శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వచనం తీసుకున్నారు.

లారీ యూనియన్ అధ్యక్షుడిగా రమేష్



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

కపిలేశ్వరపురం(మండపేట): మండపేట లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాయల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక గౌరవ అధ్యక్షుడు మల్లిపూడి గణేశ్వరరావు అధ్యక్షతన బుధవారం బైపాస్ రోడ్డులోని సంఘ కార్యాలయం వద్ద జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా రెడ్డి వీరన్న, కార్యదర్శిగా చుండ్రు శ్రీవరప్రకాష్, సంయుక్త కార్యదర్శిగా కావూరి వీర్రాజు, కోశాధికారిగా ఇంటి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ బాడీ కంట్రోలర్లుగా రేలంగి శివరామకృష్ణ, గుత్తుల గోవింద్ తదితరులు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి, సభ్యుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కె.గంగవరం: కూళ్ల గ్రామానికి చెందిన పలివెల సుబ్బాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో ప్రజాసేన కార్యదర్శి కాటే సంజీవ్ బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరకులను అందజేశారు. ప్రజాసేన పేరిట వివిధ గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

గట్టెక్కితే.. పండగే...

- వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో కలవరం
- వరి కోతలు, నూర్పిడిలో జాగ్రత్తలు అవసరం
- నాణ్యత ప్రమాణాలు కీలకమంటున్న అధికారులు



యంత్రంతో సాగుతున్న వరికోతలు

రాయవరం: ప్రస్తుతం ఖరీఫ్ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. క్లస్టర్ పరిధిలో ఇప్పటికే 40 శాతం మేర వరికోతలు పూర్తయ్యాయి. వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు కలవరపడుతున్నారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడే అవకాశమున్నందున వ్యవసాయ శాఖ రైతులను అప్రమత్తం చేస్తోంది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు రైతులు శ్రమిస్తున్నారు. అధిక శాతం రైతులు యంత్రాల ద్వారా వరి కోతలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఖరీఫ్‌లో వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అల్పపీడన ప్రభావం నుంచి గట్టెక్కితే నిజంగా పంట పండినట్టేనని రైతులు భావిస్తున్నారు. రైతులు మద్దతు ధరను పొందాలంటే మాత్రం వరి కోతలు, కోతల అనంతరం సరైన మెళకువలు పాటించాల్సి ఉంది.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

వరి కోత యంత్రంతోనే అధికంగా వరి కోతలు సాగుతున్నాయి. 80 నుంచి 90 శాతం వరి వెన్నులు పసుపు రంగుకు మారిన క్రమంలోనే పంటలు కోయాలి. పూర్తిగా ఎండి పోయే వరకు చూడకూడదు. ఈ దశలో గింజలు సుమారు 20–22 శాతం తేమ ఉంటుంది. వరి కోత ఆలస్యమైతే గింజకు పగుళ్లు వచ్చి ధాన్యం నూకలుగా మారే అవకాశం ఉంటుంది. గింజల్లో తేమ శాతాన్ని తగ్గించడానికి 2 నుంచి 3 రోజులు ధాన్యాన్ని ఎండనివ్వాలి. మద్దతు ధర రావాలంటే నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. చెత్త, దుమ్ము, మట్టిబెడ్డలు ధాన్యంలో కలవకుండా జాగ్రత్త పడాలి. కోత తర్వాత ధాన్యాన్ని తూర్పార బట్టి చెత్త, మట్టిరాళ్లు, కలుపు మొక్కల గింజలను ఏరివేయాలి. తేమ 17 శాతం లోపు తగ్గే వరకు ఆరబెట్టాలి. ఈ విధంగా చేస్తే ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. చవుడు నేలల్లో పండించిన ధాన్యాన్ని మంచి ధాన్యంతో కలపకూడదు. ధాన్యాన్ని నిల్వ చేసేటప్పుడు అధిక తేమ లేకుండా చూసుకోవాలి. శుభ్రమైన గోనె సంచుల్లో, గాదుల్లో ధాన్యాన్ని నిల్వ చేయాలి. నిల్వ చేసే ప్రదేశంలో తడి లేకుండా, బస్తాలకు చిల్లుల్లేకుండా చూసుకోవాలి.

ధాన్యం ఆరబోతలో మెళకువలు

వరికోత యంత్రంతో కోత కోస్తే మొదటిసారి వచ్చే ధాన్యాన్ని వేరుగా పోయాలి. ఆ తర్వాత కోసినవన్నీ ఒక చోట వేయాలి. ఇలా చేయడం వల్ల కల్తీ ప్రమాదం తప్పుతుంది. వరిగింజలన్నీ సిమెంట్ కళ్లాలు లేదా టార్పాలిన్ షీట్లపై ఆరబెట్టాలి. రెండు, మూడు రోజులు బాగా ఎండేలా కాళ్లతో కలియబెట్టాలి. పంట కోసాక సరిగ్గా ఆరబెట్టకపోతే గింజలు రంగు మారి, పంట నాణ్యత తగ్గే అవకాశం ఉంది. దీంతో మద్దతు ధర కోల్పోయే అవకాశముంది. నిల్వ చేసే పక్షంలో ధాన్యం బస్తాలను కింద వేయకుండా, బల్లలు పరిచి వాటిపై బస్తాలు నెట్టిలుగా వేయాలి. పురుగులు ఆశించకుండా బస్తాలపై మందును పిచికారీ చేయాలి. ఎలుకల నుంచి రక్షణకు బస్తాల నెట్ల మధ్య జింక్ ఫాస్ఫేట్ ట్యాబ్‌లెట్లు ఉంచాలి.

వాయిదా వేసుకుంటే మంచిది



వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు రైతులు రెండు, మూడు రోజులు వరి కోతలను, వ్యవసాయ పనులను వాయిదా వేసుకోవాలి. ధాన్యం మద్దతు ధర రావాలంటే 17 శాతం లోపు తేమ ఉండాలి. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే మద్దతు ధర పొందే వీలుంటుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఏ గ్రేడ్ ధాన్యం 75 కేజీల బస్తా రూ.1,652, సాధారణ రకం 75 కేజీల బస్తా రూ.1,637 ధర నిర్ణయించారు. రైతులు ధాన్యం అమ్ముకోవడంలో కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం, ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేసి, ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా 24 గంటల్లోగా ధాన్యం అన్‌లోడ్ చేసే విధంగా చర్యలు చేపట్టింది. అన్‌లోడింగ్ ఆలస్యమైతే రైతులకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశమున్నందున అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా చూస్తున్నారు. ఖరీఫ్‌లో సరాసరిన 35 బస్తాల దిగుబడి వస్తోంది.

క్లస్టర్‌లో పరిస్థితి ఇదీ..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలు ఉన్నాయి. క్లస్టర్ పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగును రైతులు చేపట్టారు.

సంక్షేమం కావాలంటే జగనే రావాలి

కె.గంగవరం: కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాలంటే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే రావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోట గ్రామంలో బుధవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు తన వారికే సంక్షేమం అందించాలని అధికారులను ఆదేశించారని, కానీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి, జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని చెబుతుండడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ మల్లిడి సుశీల, సచివాలయ మండల కన్వీనర్ తోకల శ్రీను, ఎంపీటీసీ మెండే వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి లక్ష్మణ్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, కన్వీనర్లు అయితాబత్తుల సుబ్బారావు, వాసంశెట్టి కృష్ణ, మల్లిడి వేణుగోపాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో పేదలకు న్యాయం

కపిలేశ్వరపురం: సంక్షేమ పాలనతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు కలుగుతోందని వైఎస్సార్ సీపీ యువనేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్ అన్నారు. స్థానిక సచివాలయం–1 వద్ద బుధవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతపై ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వం నుంచి లబ్ధిదారులు పొందిన లబ్ధి వివరాలను తెలిపే మెటీరియల్‌ను సంబంధిత ప్రతినిధులకు అందజేశారు. ఎంపీటీసీలు గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరరావు, పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా మురళి, పీతల బంగారం, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి శివచక్రవర్తి, పార్టీ నాయకులు మల్లిపూడి శివకుమార్, కొల్లాటి రత్నకుమారి, అరదాసి శ్రీదేవి, పిప్పర సంపతరావు, అంగాని నూకరాజు, కుడుపూడి విజయ్, చింతాపెద్దకాపు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం గ్రామ పర్యటనలో తోట పృథ్వీరాజ్

జనంతోనే జగన్ పొత్తు

రాయవరం: అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకుని పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనంతోనే పొత్తు పెట్టుకున్నారని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని కూర్మాపురంలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సర్పంచ్ చొటుపల్లి చక్రవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, వెంకటరమణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లంచాలకు, సిఫారసులకు తావు లేకుండా, గత నాలుగున్నరేళ్లలో ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయడంతో పాటు, సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను మన ప్రాంతానికి తీసుకువచ్చారని వివరించారు. అనంతరం వారు సంక్షేమ బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. అలాగే గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈతకోట లక్ష్మణరావు, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పరంశెట్టి వెంకటరమణ, పార్టీ నేతలు చొటుపల్లి వెంకటేశ్వరరావు(పండు), వాసంశెట్టి సూర్యనారాయణ, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి జగన్ వల్లే సాధ్యం

కపిలేశ్వరపురం(మండపేట): పేదవర్గాల వారి సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, మండపేట ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. మండల కన్వీనర్ పిల్లా వీరబాబు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మండపేట మండలం ఇప్పనపాడులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం–1 పరిధిలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీటీసీ వనుం సత్యవేణి, పార్టీ నాయకులు గారపాటి అశోక్‌కుమార్, కొప్పిరెడ్డి ప్రసాద్, బందెల సాయిరామ్, చిన్ని గంగాధర్, తిరుశుల అప్పారావు, చింతలపూడి మల్లిబాబు, యాదగిరి రామకృష్ణ, పోలవరపు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న పెట్టా శ్రీనివాస్



రాయవరం మండలం కూర్మాపురంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ చక్రవేణి తదితరులు



పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

రాష్ట్రంలో సమగ్ర కుల గణన చారిత్రాత్మకం

రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు

రామచంద్రపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సమగ్ర కుల గణనకు నాంది పలకడం చారిత్రాత్మక అంశమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సమగ్ర కుల గణన పైలట్ ప్రాజెక్టుగా రామచంద్రపురం నియోజకవర్గంలోని నెలపర్తిపాడులో బుధవారం మంత్రి వేణు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం కుల గణన జరిగితే, మళ్లీ ఇప్పటివరకూ జనగణన మినహా కులగణన జరగలేదన్నారు. నిత్యం నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలంటూ ఆయా వర్గాలను అక్కున చేర్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వీరందరికీ అత్యంత ప్రయోజనకరమైన సమగ్ర కుల గణన చేపట్టడం వారి అభ్యున్నతికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



నెలపర్తిపాడులో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

లంక గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే లంక గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా ప్రభుత్వం అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అద్దంకివారిలంకలో బుధవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించారు. లంక గ్రామాల ప్రజలు తోటకు ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపిస్తూ, హారతి పట్టారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి.. కుటుంబాల వారీగా ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. లోతట్టు ప్రాంతాన్ని రూ.ఐదు లక్షలతో మెరక చేయడం, ఎస్సీపేటలో రామాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై కొండేటి వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సఖిలే సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గొలకోటి రామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు సిద్ధాంతపు దొరబాబు, చిటకన గంగాభవాని, కొండమూరి నాని, నాయకులు మానేపల్లి పరమేశు, వందే చంద్రరావు పాల్గొన్నారు.



అద్దంకివారిలంకలో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఆసాదులను గుర్తించిన సీఎం జగన్

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కపిలేశ్వరపురం(మండపేట): ఆసాదుల సామాజిక వర్గానికి గుర్తింపు తెచ్చినది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ ఆసాదుల సంక్షేమ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు లేగా వెంకటేశ్వరరావు(వెంకన్న) అన్నారు. బీసీ(ఏ)గా జీవో అమలు చేసి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తమ సామాజిక వర్గ గుండెల్లో కొలువైతే, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి రాష్ట్రవ్యాప్త గుర్తింపు ఇచ్చారన్నారు. ఏడిద రోడ్డులోని పోలేరమ్మ ఆలయం వద్ద వెంకన్న ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి సంఘ సభ్యులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ మొన్నటి వరకు తమ సామాజిక వర్గం వారు ఉభయ గోదావరి జిల్లాలకే పరిమితమై ఉండేవారన్నారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కూడా తమవారు ఉన్నారన్నారు. విద్య, ఉద్యోగం ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధికి కులధ్రువీకరణ పత్రాల అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంతా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి జీవో అమల్లోకి తెచ్చి, దీర్ఘకాల సమస్యను పరిష్కరించారని ఆనందం వ్యక్తం చేశారు. తమ సామాజిక వర్గానికి సహకరిస్తున్న అతిరస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావుకు కూడా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పిల్లి నాగేశ్వరరావు, కోరుకొండ రాజు, లేగా హరిబాబు, లేగా చిన్న, లేగా సత్యనారాయణ, లేగా రాజు, లేగా శ్యామ్ కుమార్, మందపల్లి మహేష్, పిల్లి చలపతి, కోరుకొండ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

చట్ట వ్యతిరేక చర్యలను ఉపేక్షించం

డీఎస్పీ అంబికా ప్రసాద్ హెచ్చరిక

అమలాపురం టౌన్: అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కార్తిక వన సమారాధనలను సంప్రదాయబద్ధంగా, సంఘీభావంతో జరుపుకోవాలని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ సూచించారు. వన భోజనాల పేరుతో చట్ట వ్యతిరేక చర్యలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వన భోజనాలను మిగతా ప్రాంతాలకు ఆదర్శవంతంగా ఉండేలా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక వర్గాలు, యూనియన్లు, సంఘాల వారీగా జరుపుకొనే ఈ వేడుకల్లో కులాలు, వర్గాలను రెచ్చగొట్టేలా పోస్టర్లు, ఫ్లెక్సీలు, సోషల్ మీడియా పోస్టింగ్‌లు వంటి వాటికి స్వస్తి పలకాలని సూచించారు. అలాగే సామాజిక వర్గ సమావేశాల్లో అవతలి వర్గాల, వ్యక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉపన్యాసాలు ఉండాలని హితవు పలికారు. కార్తిక వన మహోత్సవాల్లో అశ్లీల నృత్యాలు, జూద క్రీడలను ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని అన్నారు. మోటారు సైకిళ్ల సైలెన్సర్లు తీసివేయడం, పెద్ద శబ్దాలతో నడపడం వంటి చర్యలకు పాల్పడితే తక్షణమే ఆ మోటారు సైకిళ్లను సీజ్ చేస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు.



నూతన భవనాలు ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: ప్రభుత్వ పాలన, గ్రామాభివృద్ధిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, బల్క్ మిల్క్ సెంటర్లు దోహదపడతాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అద్దంకివారిలంకలో రూ.80 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆయా భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాతి గవరయ్య తదితరులు అద్దంకి గ్రామ ప్రత్యేక పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొలకోటి రామకృష్ణ, మండల సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

సత్యకుమారికి అభినందనలు



రామచంద్రపురం రూరల్: తిరుపతి శ్రీవేంకటేశ్వరా వెటర్నరీ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యురాలిగా నియమితులైన రామచంద్రపురం మండలం ఉండూరుకు చెందిన దంగేటి సత్యకుమారిని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఉండూరు పీఏసీఎస్ చైర్మన్ దంగేటి వెంకటరమణ(చిన బాబు)కు సతీమణి, మాజీ సర్పంచ్ దంగేటి మంగాయమ్మ కోడలైన సత్యకుమారి మంగళవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెకు రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు సరాల ఏడుకొండలు, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ సరాల రాజ్యలక్ష్మి, ఏపీ ఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, ఉండూరు ఎంపీటీసీ ఇంత కనకదుర్గ తదితరులు అభినందనలు తెలిపారు.

జగనన్న పాలనలోనే రైతులకు చేయూత



గొల్లపాలెం పీఏసీఎస్ వద్ద సహకార జెండాను ఎగురవేస్తున్న నాయకులు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని రైతాంగానికి పూర్తి చేయూత లభిస్తోందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. 70వ సహకార వారోత్సవాల్లో భాగంగా గొల్లపాలెం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయనతో పాటు పలువురు నాయకులు సహకార పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి అధ్యక్షతన సభ జరిగింది. ఏసురాజు మాట్లాడుతూ పంట బీమా, రైతు భరోసా వంటి పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ఆర్థిక సహకారంతోనే వ్యవసాయ రంగం మనగలుగుతోందన్నారు. సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మూలారెడ్డి, ఆర్ఎంసీ వైస్ చైర్మన్ కాకతీయ రాజు, డైరెక్టర్ నల్లమిల్లి ఈశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పోతురాజు బాబురావు, తోట కృష్ణ, టేకుమూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మనో వైజ్ఞానిక ప్రగతికి దిక్సూచి



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో పుస్తకాలతో విద్యార్థులు, పెద్దలు

కపిలేశ్వరపురం: గ్రంథాలయాలు మనో వైజ్ఞానిక ప్రగతికి దిక్సూచిగా నిలుస్తాయని కపిలేశ్వరపురంలో బుధవారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. లైబ్రేరియన్ దానేటి శివకుమారి ఆధ్వర్యంలో బుధవారం పుస్తక ప్రదర్శన జరిగింది. విద్య, వైజ్ఞానిక, శాస్త్రీయ, ఆధ్యాత్మిక, చారిత్రక అంశాలకు చెందిన పుస్తకాలను ప్రదర్శించారు. వీటిని విద్యార్థులు, పుస్తక ప్రియులతో పాటు సర్పంచ్ సాకా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కె.మురళి, సీహెచ్ పెద్దకాపు, పి.సంపత్‌రావు, పి.శ్రావణ్‌కుమార్ సందర్శించారు.

విశ్వకర్మ పథకానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

కాజులూరు: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ అన్నారు. దుగ్గుదుర్రు కామన్ సర్వీస్ సెంటరులో బుధవారం పలువురు నాయీ బ్రాహ్మణులతో ఈ పథకానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించారు. సుమారు 28 సంప్రదాయ చేతివృత్తుల వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకంలో చేరిన వారికి ఉచిత శిక్షణలో రోజుకి రూ 500 గౌరవవేతనం, రూ.15 వేల విలువైన ఉపకరణాలు, ఐడీ కార్డు, సర్టిఫికెట్ అందజేస్తారని వివరించారు.